www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
22 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 294

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## నాడి పట్టే నాథుడేడి

- బస్తీ దవాఖానను సందర్శించిన హరీశ్ రావు
- కేసీఆర్ బస్తీ దవాఖానలు ప్రారంభించారు

04



## మావోయిస్టులకు సీఎం పిలుపు

పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమం
గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో నిర్వహణ
సీఎం రేవంత్ రెడ్డి పోలీసులపై ప్రశంసలు
అక్టోబర్ 21కి మహోన్నత చరిత్ర ఉంది
పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం
డ్రగ్స్ నిర్మూలించే లక్ష్యంతో ఈగల్ వింగ్
మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలి

02

## గిరిజన గూడాల్లో గుస్సాడి జాతర



**ఆదిలాబాద్ జిల్లా ఆదివాసి గ్రామాలు**
వైభవంగా దండారీ వేడుకలు
పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్
వాయిద్యాలు వాయిస్తూ సందడి చేశారు
దండారి సంబరాల్లో పాల్గొంటున్నాయి
పూర్వకాలం నుండి వస్తున్నసంస్కృతి
దీపావళిని పురస్కరించుకొని పండుగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసి గ్రామాల్లో దండారీ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. అన్ని ఆదివాసి పల్లెలు ఐక్యమత్యంతో గ్రామమంతా ఒక్కటై దండారి సంబరాల్లో పాల్గొంటు సందడి చేస్తున్నారు. పూర్వకాలం నుండి వస్తున్న తమ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రకృతి ప్రేమికులు దీపావళి సందర్భంగా ఏటా దండారీ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆదివాసి గ్రామాల్లో దండారి సంబరం.. పర్రా, వెట్టె, గుమ్మెల, తుడుం, డప్పు, చప్పుళ్ళ మధ్య చచ్చోయ్ కోలాటం.. గుస్సాడి నృత్యాలు.. మహిళల రేలా రేలా పాటలు.. గ్రామమంతా ఒక్కటై జరుపుకునే ఈ వేడుకల కోలాహలం ఈ కథనంలో చూద్దాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసి గ్రామాలు దీపావళి పండుగను పురస్కరించుకొని దండారి సంబరాలతో కోలాహలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఏటా ఆదివాసీలు తమ సాంప్రదాయంలో భాగంగా దీపావళి పండుగను పురస్కరించుకొని దండారి పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఆదివాసులకు దండారి అనేది అతిపెద్ద పండుగ.. ప్రకృతిని పూజించే ఈ అడవి బిడ్డలు తమ ఆదిదైవం "ఎత్మాసూర్" కు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి గుస్సాడీ వేషధారణలు వేసి గ్రామమంతా ఒక్కటై దండారి పండుగను ఘనంగా జరుపుకుంటారు. దండారి సంబరాన్ని జూన్ నెలలోనే అకాడి దేవతకు పూజలు నిర్వహించి.. వనదేవతలను దర్శించుకుని బయటకు తీస్తారు.. అప్పటినుండి దండారికి శ్రీకారం చూడతారు. నాలుగు నెలలపాటు ఈ వేడుకల్లో భాగంగా డప్పు వాయిద్యాలు

మిగతా 2లో..



### హరీష్ రావుకు మంత్రి అడ్లూరి సవాల్

- రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది
- హరీష్ రావుపై మంత్రి అడ్లూరి విమర్శలు
- సిద్దిపేట ఆలయంలో ప్రమాణం చేద్దామా?
- తడిబట్టలతో ఆలయంలో ప్రమాణం చేద్దాం
- ఏ శనివారం కేటాయిస్తారో చెప్పాలి
- కొండా సురేఖ బిడ్డ అందరికీ బిడ్డ లాంటిదే
- జరిగని వాటిని ప్రచారం చేయడం దుర్మార్గం


02

## రాజకీయ రసవత్తరం

ఆసక్తికరంగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక
చాలా మంది నామినేషన్లు వేశారు
ముగిసిన నామినేషన్ల గడువు
నవంబర్ 11న పోలింగ్ ఉంటుంది
బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్
దాదాపు 150 వరకు నామినేషన్లు
అక్టోబర్ 24 వరకు ఉపసంహరించుకునే ఛాన్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ఆసక్తికర పరిణామాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న చాలా మంది నామినేషన్లు వేశారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్లు గడువు ముగిసింది. ఈ లోపే ప్రధాన పార్టీ అభ్యర్థులు సహా వందల మంది వచ్చి నామపత్రాలు దాఖలు చేశారు. వీటిలో ఎన్ని చెల్లుబాటు అవుతాయి, ఎన్ని తిరస్కరణకు గురి అవుతాయో 24 గంటల్లో తేలిపోనుంది. తర్వాత అక్టోబర్ 24 వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. నవంబర్ 11న పోలింగ్ ఉంటుంది. బీజేపీ తరపున జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఆయన చివరి రోజు నామినేషన్ వేశారు. భారీ ర్యాలీగా వచ్చిన ఆయన నామినేషన్ వేశారు. ఆయనతోపాటు సీనియర్ లీడర్లు ఉన్నారు. ఈ స్థానంలో బరిలో నిలబడేందుకు చాలా మంది పోటీ వచ్చినప్పటికీ చివరి వరకు అన్ని కాలిక్యులేషన్స్ వేసుకొని దీపక్‌రెడ్డికే బీజేపీ అధినాయకత్వం ఛాన్స్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీలో ఉంటే, బీఆర్ఎస్ తరపున మాగంటి గోపీనాథ్ భార్య సునీత బరిలో నిలబడ్డారు. ఇక్కడ



అధికారికంగా ఎన్ని నామినేషన్లు పడ్డా సరే పోటీ మాత్రం ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉంటుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను అన్ని పార్టీలు చాలా సీరియస్‌గా తీసుకున్నాయి. అందుకే ప్రభుత్వాన్ని ఎన్ని విధాలుగా ఇరుకున పెట్టాలో అని ప్రతిపక్షాలు ఎదురు చూస్తున్నాయి. వారిని తమవైపు తిప్పుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. హైడ్రాతో ఇబ్బంది పడ్డవాళ్లు. ప్రభుత్వ పథకాలు అందని వారిని టార్గెట్ చేస్తూ వారంతా తమకు ఓటు వేసేలా ఒప్పించే వ్యూహాల్లో ఉన్నాయి. కానీ ప్రభుత్వం

మిగతా 3లో..



### ఏం జరిగింది?

- నిజామాబాద్‌లో రియాజ్ ఎన్ కౌంటర్
- రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది
- ప్రమోద్ పై దాడిచేసి ప్రాణాలు తీశాడు
- రియాజ్‌ను పట్టుకునే ఎన్ కౌంటర్
- చేశారనే టాక్ గట్టిగా వినిపిస్తోంది
- కానిస్టేబుల్ వద్ద గన్ లాక్కున్న రియాజ్
- జాతీయ మానవహక్కుల కమిషన్ వివరణ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నిజామాబాద్ రియాజ్ ఎన్ కౌంటర్ తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఈనెల 17 తేదిన సీరియల్ అఫెండర్ రియాజ్ ను అరెస్ట్ చేసి, బైక్ పై తీసుకెళుతుండగా, కత్తితో కానిస్టేబుల్ ప్రమోద్ పై కిరాతకంగా దాడిచేసి ప్రాణాలు తీశాడు. ఈ ఘటనను తెలంగాణ పోలీసుశాఖ

మిగతా 2లో..

## తిరుపతే అభయ్



మావోయిస్టుల వరుస లొంగుబాట్లు
పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది
తాజాగా ఆశన్న, మల్లోజుల లొంగుబాటు
అభయ్ పేరిట లేఖ విడుదలైంది
లేఖలో విప్లవ ద్రోహులుగా అభివర్ణించారు
అభయ్ ఎవరనే విషయంపై తీవ్ర చర్చ
ఆయన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇప్పటికే కీలక నేతలైన మల్లోజుల వేణుగోపాల్, తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న సహా వందల మంది మవోయిస్టు సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాగా, గత కొంత కాలంగా మావోయిస్టు నేత అభయ్ పేరుతో లేఖలు వెలువడుతున్నాయి. ఇటీవల మల్లోజుల, ఆశన్న లొంగుబాట్లను ఖండిస్తూ అభయ్ పేరిట లేఖ విడుదలైంది. అయితే ఈ అభయ్ ఎవరనే విషయంపై తీవ్ర చర్చ జరిగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ.. అభయ్‌గా లేఖలు రాస్తున్నట్లు తెలంగాణ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఉటంకిస్తూ..

మిగతా 2లో..

## జెట్ స్పీడ్‌తో నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు
పొలిటికల్ హీట్‌ను పీక్స్‌కు తీసుకెళ్లాయి
ప్రచారంలో జోరుగా నాయకులు
సానుభూతి ఓటింగ్ పై సునీత ఫోకస్
వ్యూహాత్మకంగా దూసుకుపోతున్న నవీన్
ప్రతీ ఒక్కరినీ స్వయంగా కలుసుకుంటున్నారు
ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం
కాంగ్రెస్‌ను లైట్ తీసుకున్న బీజేపి అభ్యర్ధి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా పొలిటికల్ హీట్ ను పీక్స్ కు తీసుకెళ్లాయి. సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మృతితో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. సాధారణంగా సిట్టింగ్ సీటుకు అనివార్య కారణాల వల్ల మధ్యలో ఎన్నికలొస్తే, సానుభూతి పైనే సిట్టింగ్

మిగతా 2లో..



## టార్గెట్ రేవంత్



కాంగ్రెస్ అధికారంలోకి రెండేళ్లు
పార్టీ నేతలు మధ్య వివాదాలు
సీఎంను నిత్యం టార్గెట్ చేస్తున్నారు
క్రమశిక్షణ కమిటీ పూర్తిగా విఫలం
తొలినాళ్లలోనే చర్యలు తీసుకోవాల్సింది
బీఆర్ఎస్ వెనకుందనే టాక్

04

# హరీష్ రావుకు మంత్రి అడ్లూరి సవాల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఘాటుగా స్పందించారు. కేబినెట్ సమావేశాల గురించి బీఆర్ఎస్ నేతలు అబద్ధ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత విషయాలు ఎప్పుడూ చర్చలోకి రాలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హరీష్ రావుకు అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? అంటూ సవాల్ చేశారు. హరీష్‌రావుకు ఎంతో సెంటిమెంట్‌గా ఉన్న దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ఆలయంలో ప్రమాణం చేద్దాం అని ఫైర్ అయ్యారు. తాను తన తల్లిదండ్రులపై ప్రమాణం చేసి నిజం చెబుతానని.. ముఖ్యమంత్రి అనుమతి తీసుకుని వస్తానని చెప్పుకొచ్చారు. హరీష్‌రావు ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలడా? అని అన్నారు. అలాగే హరీష్ రావు తనకు ఏ శనివారం సమయం కేటాయిస్తారో చెప్పాలని అడిగారు. హరీష్ రావు ఈ సవాల్‌ను స్వీకరించాలని చెప్పారు. కొండా సురేఖ బిడ్డ తమ అందరికీ బిడ్డ లాంటిదే అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. అలానే కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా? ఇది ఎంత దారుణం? మంత్రులపై ఈ విధంగా అబద్ధ ఆరోపణలు చేయడం పూర్తిగా అనైతికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్‌లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. హరీష్‌రావు చేసిన ఆరోపణలపై వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అంటే అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అని.. ప్రజల్ని తప్పుదోవ పట్టించడంలో వారికి సాటి ఎవ్వరూ లేరని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంత అణచివేత పాలన కొనసాగించారో అందరికీ తెలుసని అన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. అంతే కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్నారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదే అని విమర్శించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు.. పదేండ్లు మేమే రాజులం, మేమే మంత్రులం అన్నట్టు వ్యవహరించారన్నారు. ప్రజల బాధలు వినకుండా, ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టి తమ అహంకార పాలన నడిపారని తెలిపారు. హరీష్ రావు నిజాయితీ గల వ్యక్తి అయితే ప్రజల ముందే ప్రమాణం చేయాలని.. తప్పుడు ప్రచారం మానుకోవాలని చెప్పారు. ఆయన సవాల్‌ను స్వీకరిస్తే నిజాలు బయటపడతాయని స్పష్టం చేశారు.

# జెట్ స్పీడ్‌తో నవీన్ యాదవ్

( మొదటిపేజీ తరువాయి )

ఎమ్మెల్యే కు చెందిన పార్టీ ఆశలు పెట్టుకుంటుంది. అందులోనూ మాగంటి గోపీనాధ్ భార్య సునీతకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడంతో సానుభూతి ఓటింగ్ పై ఇంకాస్త ఎక్కువ ఆశలే పెట్టుకుంది బీఆర్ఎస్ పార్టీ. దీనికితోడు జూబ్లీహిల్స్ బరిలో నిలిచిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాధ్ భార్య సునీత ఎన్నికల ప్రచారం కొనసాగుతున్న తీరు, కాస్త కొత్తగా ఉంది. కేటీఆర్ వంటి కీలక నేతలు పాల్గొన్న బీఆర్ఎస్ ఎన్నికల సభల్లో ఎమ్మెల్యే అభ్యర్ధి సునీత భావోద్వేగం ఆపుకోలేక, భర్తను అభిమానించే కార్యకర్తలను చూసి తీవ్ర దుఖంతో కన్నీళ్లు పెట్టుకుంటున్న తీరు చూసి సొంత పార్టీ నేతలే షాకవుతున్నారు. కనీసం వేదికపై నోటి నుండి మాటలు రాలేనంతగా ఆమె విలపిస్తుంటే, మాగంటి గోపీనాధ్ అభిమానులే కాదు, చూస్తున్న ఓటర్లను సైతం కలచివేస్తోంది. భర్త, పిల్లలు తప్ప ఇన్నాళ్లు రాజకీయాలను కన్నెత్తి చూడని సునీత ,ఇప్పుడు ఏకంగా హోరాహోరీ పోరులో ఎమ్మెల్యేగా గెలుపు కోసం అధికార పార్టీతోనే పోటీపడుతున్నారు. కన్నీళ్లే ప్రచారాస్త్రంగా మాగంటి సునీత ప్రచారం కొనసాగుతున్న తీరుపై కాంగ్రెస్ నేతలు విమర్శలతో విరుచుకుపడుతుంటే, మరోవైపు బీఆర్ ఎస్ నేతలు,సోషల్ మీడియాలో సైతం సునీతకు గట్టిగానే మద్దతు లభిస్తోంది. గతంలో జూబ్లీహిల్స్ లో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాధ్ చేసిన అభివృద్ధి, నమ్మిన క్యాడర్, నమ్ముకున్న నియోజకవర్గ ఓటర్లతోపాటు భార్య సునీతపై సానుభూతి ఖచ్చితంగా వర్కవుట్ అవుతుందనే కొండంత ఆశతో ఉన్నారు బీఆర్ఎస్ నేతలు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్ధిగా పోటీపడుతన్న నవీన్ కుమార్ యాదవ్ సైతం రాజకీయాల్లో తానేం తక్కువ కాదంటూ మొదటి నుండి జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. తీవ్ర పోటీలో సైతం సీటు దక్కించుకున్న నవీన్ , సీటు ప్రకటన క్షణం నుండి నామినేషన్ వేసే వరకూ పార్టీలో సీనియర్లు, కుల పెద్దలు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన బీసీ నేతలు ఇలా ప్రతీ ఒక్కరినీ స్వయంగా వెళ్లి కలసి ,వారి మద్దతు తీసుకున్నారు. తనకు సీటు కేటాయించుకుండా అడ్డుపడ్డ అంజన్ కుమార్ యాదవ్ , అనిల్ కుమార్ యాదవ్ లను సైతం తానే స్వయంగా వెళ్లి కలసి , వారి మెప్పుపొందరాంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు.

ప్రతిపక్ష బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను కూడా నవీన్ కలిసారంటే పరిస్థితి అర్ధం చేసుకోవచ్చు. ఇలా పార్టీలతో సంబంధం లేకుండా మనోడు అనిపించుకునేలా నవీన్ వ్యూహాత్మకంగా దూసుకుపోతున్నారు. గతంలో రెండు సార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం, ముఖ్యంగా ఎంఐఎం మద్దతు దండిగా ఉన్న నేపథ్యంలో గెలుపు పై గట్టి ధీమాతో ఉన్నారు నవీన్ కుమార్ యాదవ్. నామినేషన్ ముందు వరకూ శత్రువులను సైతం దగ్గర చేసుకునే ప్రయత్నం చేయడం, నామినేషన్ తరువాత ఓటర్లను ఆకర్షించేలా ప్రచారం ముమ్మరం చేయడం ద్వారా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాధ్ చేసిన అభివృద్ధి,సానుభూతి, బీఆర్ ఎస్ బలమైన క్యాడర్ ను తట్టుకుని నవిన్ విజయం సాధిస్తారా లేదా అనేది వేచిచూడాలి.

జూబ్లీహిల్స్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్ధి లంకల దీపక్ రెడ్డి ఎన్నికల ప్రచారం తీరు కాంగ్రెస్ , బీఆర్ఎస్‌కు దీటుగా కొనసాగుతోంది. గత ప్రభుత్వాలు జూబ్లీహిల్స్ ను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని,బీజేపి అధికారంలోకి వస్తే ,మేం చేయబోయే అభివృద్ధి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు దీపక్ రెడ్డి. గత ఎన్నికల సమయంలో మేము మూడవ స్ధానంలో ఉన్నాం. ఇప్పుడు రెండ స్ధానికొచేరుకున్నాం. నెక్స్ ఈ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయమే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎఐఎం ,కాంగ్రెస్ కలిసినా భయంలేదు. మాకు పదిశాతం ఓట్లు పెరిగితే చాలు గెలిచితీరుతామంటున్నారు. దేశంలో మోదీ అభివృద్ధి , కిషన్ రెడ్డి నాయకత్వంతో గెలుపు పక్కా అంటూ లెక్కలు చెప్పేస్తున్నారు. పోటీ బీఆర్ ఎస్ వర్సెస్ బీజేపి మధ్యే ఉంది. గెలిచేది బీజేపినేని, ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రచారం పీక్స్ కు తీసుకెళుతున్నారు లంకల దీపక్ రెడ్డి. అధికార కాంగ్రెస్ ను లైట్ తీసుకున్న బీజేపి అభ్యర్ధి గెలుపు లెక్కలు పోలింగ్ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ తెస్తాయో , లేదో వేచిచూడాలి.

# తిరుపతే అభయ్

( మొదటిపేజీ తరువాయి )

జాతీయ మీడియా వరుస కథనాలు వెలువరిస్తోంది. మల్లోజుల, ఆశన్న లొంగుబాటుపై ఇటీవల అభయ్ రాసిన లేఖలో వారిద్దరిని విప్లవ ద్రోహులుగా అభివర్ణించారు. వారిని ప్రజలు తన్నితరిమేయాలని పిలుపునిచ్చారు. లొంగిపోయిన నాయకులు రైట్ వింగ్ సిద్ధాంతాలను తలకు ఎత్తుకున్నారని విమర్శించారు. వారు పార్టీ విశ్వాసఘాతకులు అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాక్షేత్రంలో వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

**మావోయిస్టు పార్టీ సారథి..**

ఆపరేషన్ కగార్ చేపట్టిన నుంచి కేంద్ర ప్రభుత్వం.. మవోయిస్టులపై భీకర దాదులు చేస్తోంది. ఈ క్రమంలో గతంలో కేంద్ర కమిటీ కార్యదర్శిగా పని చేసిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు 2025 మే 21న అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. రెండు నెలల తర్వాత ఇంద్రావతి ప్రాంతంలో సమావేశమైన మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ తిప్పిరి తిరుపతిని పార్టీ కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. మావోయిస్టు సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ) చీఫ్‌గా పనిచేసిన తిరుపతి.. ఆ తర్వాత నుంచి మావోయిస్టు పార్టీ సారథిగా వ్యవహరిస్తున్నారని కథనాలు వెలువడ్డాయి. అయితే ఆయనే అభయ్ పేరు మీద లేఖలు విడుదల చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా, ఈ లేఖల్లో.. మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్.. అంటూ పేర్కొనడం గమనార్హం. అయితే తిప్పిరి తిరుపతి అటు పార్టీ అధికార ప్రతినిధిగా ఇటు ప్రధాన కార్యదర్శిగా.. రెండు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**జగిత్యాల జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి**

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు దాదాపు 42 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. ఆయనకు ఇద్దరు తమ్ముళ్లు, ఒక అక్క ఉన్నారు. 1984లో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సవంత్సరం చదువుకునే క్రమంలోనే.. తిరుపతి రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)లో జాయిన్ అయ్యారు. అనంతరం.. విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణల్లో కేసులు నమోదు కావడం, పోలీసుల వేధింపలతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు చెబుతారు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో దళ సభ్యుడిగా, కమాండర్‌గా పనిచేసి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నట్లు తెలుస్తోంది.

# గిరిజన గూడాల్లో గుస్సాడి జాతర

( మొదటిపేజీ తరువాయి )

వాయించడం నృత్యాలు చేయడం ప్రారంభిస్తారు. దీపావళి పండుగకు పది రోజుల ముందు తమ గ్రామాల్లో ఉత్సవాన్ని ఘనంగా ప్రారంభిస్తారు. ముందుగా తమ సంస్కృతి సాంప్రదాయంలో ఒక భాగమైన వాయిద్యాలు పర్ర, వేట్టె, గుమ్మెల, టప్పుల్, ఇతర వాయిద్యాలకు పూజలు నిర్వహించి ఎత్మాసూర్ దేవతకు పూజలు నిర్వహించి భోగి పండుగను ప్రారంభిస్తారు. ఈ భోగి పండుగ రోజే గుస్సాడీ వేషధారణను వేస్తారు. కోరిన కోరికలు, మొక్కుకున్న నోములు సమర్పించే దిశగా గుస్సాడి వేషధారణను ఒక దీక్షలాగా పది రోజులపాటు తీసుకుంటారు. ఒళ్లంతా విభూది పూసి, ముఖానికి మసి తలపై నెమలిపించాల టోపీ మెడలో అడవిలో లభించే వనమూలికల హారాలు, రుద్రాక్ష మాలలు, భుజాన జంతువుల చర్మం.. చేతిలో రోకలి (గంగారం సోటా) నడుముకు కాళ్లకు గజ్జలు ధరించి ఈ గుస్సాడీ వేషధారణను ఒక దీక్షలాగా వేస్తారు. ఇదే తమ ఎత్మాసూర్ దేవత యొక్క ప్రతిరూపంగా భావిస్తారు. భోగి పూజల అనంతరం అందరూ నెమలిపించాలా టోపీలకు తమ వాయిద్యాలకు మొక్కులు చెల్లించి వేడుకలను ప్రారంభిస్తారు. ఇక తుడుం మోతలు.. డప్పుల చప్పులు.. పర్రా, వేట్టే, గుమ్మెల, టప్పుల్ వివిధ రకాల వాయిద్యాలకు ప్రాధాన్యతనిస్తూ చచ్చోయ్ కోలాటం ఆడుతూ నృత్యాలు చేస్తారు. వారికి తోడుగా గుసాడీలు సైతం నృత్యాలు చేస్తూ సందడి చేస్తారు. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ఒక పండుగల గ్రామమంతా ఒక్కటై మరొక గ్రామానికి చుట్టాలుగా తమ సాంప్రదాయంలో ఒక భాగంగా రావడం పోవడం చేస్తుంటారు. అలా తమ ప్రేమానుభావాలను పంచుకుంటూ అందరూ కలిసికట్టుగా దండారి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. ఒక గ్రామానికి మరొక గ్రామం దండారి వెళ్లిన వారికి అతిథిగా వారు డప్పు చప్పుళ్ళ మధ్య స్వాగతిస్తూ.. రోజంతా దండారి వేడుకలు జరుపుకొని వారికి భోజన సౌకర్యాలు సైతం కల్పిస్తుంటారు. ఇలా ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లిన దండారి వేడుకల్లో ఆదివాసీలు పెళ్లి సంబంధాలను సైతం ఏర్పరచుకుంటారు. పెళ్లి చూపులను చూసుకొని డికాషన్ చాయి తాగడానికి వెదురు కర్రను పట్టుకొని వేసవికాలంలో వస్తారు. అప్పుడు డికాషన్ చాయ్ తాగారంటే ఒక బీడీని భూదేవతకు సమర్పించి సంబంధం కుదుర్చుకుంటారు. ఇక పెళ్లికి ముహూర్తాన్ని తీసి.. ఇరువురి పేర్లను జతచేస్తూ పెళ్లి పత్రికలను తీసి పెళ్లిలను సైతం జరుపుకుంటారు. ఇలా తమ పెళ్లిళ్లకు సైతం ఈ వేడుక ఒక వేదికగా నిలుస్తోంది. దండారి సంబరాన్ని పురస్కరించుకొని దీపావళి వేడుకలను ఆదివాసీలు తమ ఆది దైవాలకు పూజలు నిర్వహించి లక్ష్మీ పూజలు నిర్వహిస్తారు. మరుసటి రోజు కోలాబోడి అనే కార్యక్రమాన్ని నిర్వహించి దండారీ వేడుకలను ముగిస్తారు.



ఆదిలాబాద్ జిల్లాలోని చించు ఘాట్ గ్రామంలో నిర్వహించిన దండారి సంబరాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని వాయిద్యాలు వాయిస్తూ వేడుకల్లో సందడి చేశారు. పలు మారుమూల గ్రామాల్లోనూ పర్యటిస్తూ ఆదివాసీల ఐక్యమత్యాన్ని తిలకించేందుకు దండారి వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా మారుమూల గ్రామాల్లోనూ దండారి సందడి ఉత్సాహభరితంగా కొనసాగింది. పులి వేషధారణ, టప్పుల్ వేషధారణ, కోడల్ వేషధారణతోను ఆదివాసీలు చచ్చోయ్ నృత్యాల మధ్య ఎంతో సందడి చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు .ఈ వేషధారణతో చేసిన నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వచ్చిన అతిథులకు మర్యాదలు చేస్తూ ఆదివాసీలు తమ దండారి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఇలా ప్రతి ఏటా ఆదివాసి తెగల్లోని గోండు, కోలాం తెగలవారు ఈ దండారి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.





# ఏం జరిగింది?

( మొదటిపేజీ తరువాయి )

చాలా సీరియస్ గా తీసుకోవడమేకాదు, రియాజ్ ను పట్టుకోవడం ఇజ్జత్ కా సవాల్ గా భావించి, ఏకంగా 50వేల రివార్డ్ ను ప్రకటించింది. మొత్తానికి సారంగపూర్ శివారులో రియాజ్‌ను గుర్తించి, పట్టుకునే ప్రయత్నం చేస్తే , దాడిచేసి,తాళ్లతో కట్టి మరీ ఆసుపత్రికి చేర్చారు పోలీసులు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. రియాజ్‌ను పట్టుకున్న సమయంలోనే ఎన్ కౌంటర్ చేశారనే టాక్ గట్టిగా వినిపించింది. మీడియా ఛానెల్స్ సైతం రియాజ్ ఎన్ కౌంటర్ అనే వార్తలను ప్రసారం చేశాయి. ఎన్ కౌంటర్ కాకముందే ఇది ఎలా సాధ్యం. ఎన్ కౌంటర్ అనే వార్తలు ఎవరు లీక్ చేశారు. కారణాలేంటి. ఎన్ కౌంటర్ చేద్దామని ఫిక్స్ అవ్వడం వల్లనే ఇలా ముందుగా లీకులు ఇచ్చారనే అనే వాదనలు వినిచించాయి. రియాజ్‌ను ఆసుపత్రిలో చేర్చిన క్షణం నుంచి ఏం జరుగుతుందోననే ఉత్కంఠత సర్వత్రా నెలకొంది. కోర్టుకు తీసుకెళతారా, ఆసుపత్రిలోనే లేపేస్తారా అనే ఊహాగానాలు వినిపించాయి. అంతా అనుకున్నట్లు అరెస్ట్ జరిగిన కొద్ది గంటల్లోనే రియాజ్ ఎన్ కౌంటర్ అనే అధికారిక ప్రకటన రానే వచ్చింది. ఆసుపత్రిలో రియాజ్ గలాటా చేస్తున్నాడు, తలుపులు బద్దలు కొడుతున్నాడు. అడ్డుకునేందుకు ఆర్ ఐ, ఎస్సై ,కానిస్టేబుల్ లోపలికి వెళ్లారు. కానిస్టేబుల్ వద్ద గన్ లాక్కున్న రియాజ్ ట్రిగర్ నొక్కి కాల్పులు జరిపే ప్రయత్నం చేయబోయాడు. ఇంతలో ఆత్మరక్షణలో భాగంగా అక్కడే ఉన్న ఆర్ ఐ రియాజ్ పై కాల్పులు జరపడంతో ప్రాణాలు కోల్పోయాడంటూ ఉన్నతాధికారులు ప్రకటించారు. ఇలా రియాజ్ కథ ముగిసింది. కానిస్టేబుల్ ప్రమోద్ ను రియాజ్ చంపడం దారుణం. రియాజ్ ను ఎన్ కౌంటర్ చేయడంతో న్యాయం జరిగిందని, సరైన శిక్ష వేశారని,పోలీసులపై ప్రశంసల వర్షం కురిపించడం సోషల్ మీడియా వేదికగా చకచకా జరిగిపోయాయి. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉంది. అయితే ఈ ఘటన అనేక ప్రశ్నలను సంధిస్తోంది. దీనిపైనే జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించింది. అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు నోటీసులు ఇచ్చింది. వాటిని నివృత్తి చేయాలని పేర్కొంది. మరో వర్గం కూడా రియాజ్ ది ఫేక్ ఎన్ కౌంటర్ విమర్శిస్తున్నారు.

రియాజ్ సీరియల్ గజదొంగని పోలీసులకు తెలిసినా, అతని అరెస్ట్ విషయంలో కానిస్టేబుల్ ఒక్కడు మాత్రమే వెళ్లడం ఎంత వరకు కరెక్టని ప్రశ్నించే వాళ్లు ఉన్నారు. అరెస్ట్ సమయంలో అనుసరించాల్సిన ప్రొటో కాల్ ను ఉల్లంఘించారని మాజీ పోలీసు అధికారులు చెబుతున్న మాట. ఒక్క కానిస్టేబుల్ రియాజ్ అరెస్ట్ కు వెళ్లడం, అందులోనూ పోలీసు వాహనంలో కాకుండా తన సొంత బైక్ పై కరుడుగట్టిన నేరస్తుడ్ని తీసుకురావడం ఇలా ఇవన్నీ పోలీసుల వైఫల్యం కాదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసుల వాహనంలో వెపన్ తో ఎస్సై, ఇద్దరు కానిస్టేబుల్స్ కలసి అరెస్ట్ సమయంలో పాటించాల్సిన ప్రొటోకాల్ ను పాటిస్తే ప్రమోద్ ప్రాణాలు కోల్పోయే వాడు కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.



ఇదిలా ఉంటే రియాజ్ అరెస్ట్, ఆ తరువాత పరిణామాల్లో సైతం పోలీసుల తీరుపై అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రియాజ్ ఉన్నాడనే సమాచారంతో సారంగాపూర్ వెళ్లిన పోలీసులు అక్కడ కూడా రియాజ్ ఎదురుదాడికి పాల్పడే పరిస్థితిని ఊహించకపోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. తాళ్లతో రియాజ్ ను కట్టేసి ,దాడి చేసి మరీ ఆసుపత్రికి తీసుకెళ్లారనే వార్తలు వచ్చాయి. దొరికిన స్పాట్ లోనే ఎన్ కౌంటర్ చేశారనే ప్రచారం జరిగింది. అరెస్ట్ తరువాత బేడీలు వేసిన రియాజ్ ను ఆసుపత్రిలో చేర్చినట్టు పోలీసులు ప్రకటించారు. ఉదయం అక్కడ తలుపులు బద్దలు కొడుతున్నాడు, ఆసుపత్రిలో గలాటా చేస్తున్నాడనే సమాచారంతో లోపలికి వెళ్లినట్టు చెబుతున్నారు. ఇంత కరుడుగట్టిన నేరస్తుడికి బేడీలు వేసి చికిత్స అందించలేదా అని మరికొందరు సంధిస్తున్న ప్రశ్న. ఒకవేళ కాళ్లకు చేతులకు బేడీలు ఉంటే తలుపులు ఎలా బద్దలు కొడతాడు? ఒకవేళ బేడీలు తొలిగిస్తున్నప్పుడు , అవసరమైన జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదు? అనే అనుమాన పడుతున్నారు. ఇదిలా ఉంటే కానిస్టేబుల్ వద్ద గన్ లాక్కున్నాడని చెబుతున్నారు. ఆసుపత్రిలో ఈ మొత్తం వ్యవహారం చూసిన సాక్షులు ఎవరు? అలా ఉంటే ఇప్పటి వరకూ ఎవరూ బయటకు రాలేదు. కనీసం గన్‌షాట్ సౌండ్ ఎవరూ వినలేదా, వింటి మీడియా ముందుకు ఎవరూ ఎందుకు రాలేదు. ఇవన్నీ కూడా రేపు జాతీయ మానవహక్కుల సంఘం నుంచి ఎదుర్కోవాల్సిన ప్రశ్నలు. అన్నింటికీ పోలీసులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# మావోయిస్టులకు సీఎం పిలుపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని, తద్వారా దేశ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి పోలీసులపై ప్రశంసలు కురిపించారు. పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని, విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడన్నారు. ఒకవైపు నెత్తురు చెందుతున్నా, ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని.. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించు కోవడం మనందరి కర్తవ్యం అన్నారు. మనకున్న బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా ఘనంగా నిర్వహించుకుంటున్నాం అన్నారు. పోలీసు అమరవీరులను స్మరించుకునే రోజు అక్టోబర్ 21కి మహోన్నత చరిత్ర ఉంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎందరో పోలీసులు దేశం కోసం ప్రాణ త్యాగం చేశారు. వారందరికీ పేరు పేరునా హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారు. గ్రేహౌండ్స్ కమాండోలు.. టి. సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం చెందారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారు. మూడు రోజుల కింద నిజామాబాద్ లో సిసిఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారు. భర్త ప్రమోద్ ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీ తో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నాం. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి 16 లక్షల ఎక్స్ గ్రేషియా, పోలీస్ వెల్ఫేర్ నుండి 8 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటాం. 29062008 న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజులరామారంలో 200 గజాల స్థలం కేటాయించాం. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణం. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం, దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించింది. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందింది. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనం. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నా. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలాపాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలంగాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం. ఇందుకోసం పోలీస్ శాఖకు పూర్తి స్వేచ్ఛతోపాటు విస్తృత అధికారాలు ఇచ్చాం. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది. సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.

మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి. టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్. సాంకేతికత వినియోగంలో తెలంగాణ పోలీసులు అందరి కంటే ముందంజలో ఉండటం మనకు గర్వకారణం. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం. ఈ విభాగం అత్యంత సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది. సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోంది. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి. కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది. మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోవాలి. దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి. ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతతో పని చేసిన అధికారుల కృషిని మా ప్రభుత్వం గుర్తించింది. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోంది. సమాజానికి దగ్గరగా ఉండే పోలీసింగ్ మోడల్ ను అనుసరించాలి.ముఖ్యంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవి అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం.



# అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

**సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న**

**తొర్రూరు, విశాలభారతి:**



6 నెలలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గోపాలగిరి రోడ్డులో నిర్మించిన ఇల్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని చేస్తున్న పోరాటం ప్రజా ప్రతినిధులకు అధికారులకు కనిపించడం లేదా అని... పది రోజులుగా ఇల్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్ లో ఉంటున్నా కూడా స్థానిక ఎమ్మెల్యే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం ఎంతవరకు సమంజసం అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న విమర్శించారు. మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ల వద్ద సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి యాకూబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజన్న మాట్లాడుతూ... గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయకుండా రెండు సంవత్సరాలు కాలయాపన చేసిందని ఆ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇండ్లను పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం సరికాదని అన్నారు. ఆ ప్రభుత్వం చేసిన పని ప్రస్తుత ప్రభుత్వం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయి నాలుగు సంవత్సరాలు అవుతుందని కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని గత ప్రభుత్వమే నిరంకుశ ప్రభుత్వమని గద్దె దించితే ప్రస్తుత ప్రభుత్వం కూడా వాళ్లకన్నా మేమేం తీసిపోలేదని దొందు దొందే అన్న రీతిలో ప్రస్తుత ప్రభుత్వ తీరు ఉందని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఇల్లు లేని నిరుపేదలు గృహప్రవేశాలు చేసుకొని ఇండ్లలో ఉంటున్న వారికి వెంటనే పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, మండల కమిటీ సభ్యులు మర్క సాంబయ్య దొనుక దర్గయ్య, పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య, నాయకులు తిమ్మిడి రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి అమీర్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ శోభ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పుల, విశాలభారతి:**



మండలకేంద్రంలోని రైతు వేదికలో జాతీయ స్థాయిలో అమలవుతున్న జాతీయ ఆహార భద్రత,పోషణ మిషన్(ప్యాడీ),జాతీయ నూనెగింజల మిషన్(గ్రౌండ్‌నట్)కార్యక్రమాల కింద రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని,రైతు దేశానికి వెన్నెముకని,రైతు బలంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని,అందుకే ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రైతులకు మద్దతుగా నిలుస్తోందని,రైతులు పండించే ప్రతి గింజకు విలువ దక్కేలా చర్యలు తీసుకుంటామని,నాణ్యమైన విత్తనాల పంపిణీతో పాటు వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం ద్వారా దిగుబడులు పెంచడం లక్ష్యమని,అలాగే రైతులు ఈ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని,ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు,మద్దతు ధరలు,సాంకేతిక సాయం ద్వారా తమ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని,పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి రైతు సంతోషంగా, స్వావలంబిగా ఉండడం నా లక్ష్యమని,రైతులకు అవసరమైన సహకారం అందించడానికి ఎల్లప్పుడూ నేను ముందుంటానని,రైతు కష్టానికి గౌరవం దక్కేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆండాలు,ఏడీఏ పరశురామ్ నాయక్,ఏవో దివ్య,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,పీఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్,విజయ డైరీ జిల్లా చైర్మెన్ కాసారపు ధర్మారెడ్డి,ఏఈఓ లు సాగర్,భాస్కర్,సంతోష్,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,సొసైటీ సభ్యులు,రైతు సంఘాల ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుదర్శన హోమం




**ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు**

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

శ్రీశ్రీశ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో( గౌరెల్లి గుట్ట) స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నేడు ఉదయం ఎనిమిది గంటల సమయంలో లక్ష్మీ నరసింహ స్వామి వారికి అభిషేకం సుదర్శన హోమం కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరు రాజు తెలిపారు, ఇట్టి కార్యక్రమానికి సమస్త గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు వివిధ పార్టీల నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘ నాయకురాలు, యువజన సంఘాల నాయకులు, యువతి యువకులు ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ స్వయంభు స్వర్ణ గిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విచ్చేసి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, డైరెక్టర్లు నీడూరు రాజు,గ్యార దివ్యదాస్, చిట్టి గారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి



**బూరుగు కృష్ణారెడ్డి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు**

చౌటుప్పల్, విశాలభారతి: మండల కేంద్రంలోని చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆర్డీవో వి.శేఖర్ రెడ్డి కి వినతి పత్రమును ఇవ్వడం జరిగింది.వినతి పత్రములో రైతు ఆరు కాలాలు కష్టపడి పండించిన వరి ధాన్యం వర్షాలతో,మధ్య దళారులతో,మద్దతు ధర లేక అధిక తూకముతో రైతాంగం నష్టపోతున్నారు.అక్కడక్కడ కేంద్రాలను ప్రారంభించిన నేటికీ కొనుగోలు జరగలేదు.వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలలో సౌకర్యాలు రైతులకు చెట్లు,మంచినీటి సరఫరా, వాచ్ మెన్, కరెంటు, ధాన్యం ఆరబోయడానికి నేల చదును చేయాలి,రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాథమిక వసతులు కల్పించాలి,హమాలీ డబ్బులు చెల్లించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షులు పడమటి కృష్ణారెడ్డి,బొక్క యాదిరెడ్డి, ఏనుగు నర్సిరెడ్డి, గడగోటి నరసింహ, శంకరయ్య, నర్సిరెడ్డియాదమ్మ, రంగారెడ్డి,శ్రీనివాసరెడ్డి, వెంకట్ రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

# పోలీసు అమరులకు నివాళులు

**తిరుమలగిరి, విశాలభారతి :**

పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని, మంగళవారం నాడు తిరుమలగిరి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుండి తెలంగాణ చౌరస్తా వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరుల కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విధి నిర్వహణలో నక్సల్స్ తో పాటు సంఘ విద్రోహశక్తుల చేతిలో అమరులైన పోలీసుల త్యాగాన్ని మరువలేమని అన్నారు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రజల రక్షణ కోసం పోరాడుతూ ఎందరో అమరులై తమ కుటుంబాలకు దూరమయ్యారని అన్నారు ప్రజారక్షణ ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పని చేస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



# చెరువులోపడి అమ్మమ్మ మనవరాలు మృతి



**రాజేంద్రనగర్, విశాలభారతి:**

ప్రమాదవశాత్తు చెరువులో పడి అమ్మమ్మ, మనవరాలు మృతి చెందిన సంఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో బండ్లగూడ మున్సిపల్ పరిధిలోని పీరంచెరువు గ్రామంలోని జే ఎన్ ఎన్ యు ఆర్ ఎం క్వార్టర్స్ సమీపంలో ఉన్న చెరువు వద్దకి యూసఫ్ బీ(60) తో పాటు ఆమె మనవరాళ్లు సబియా (10), అయేషామ్మ (19) వెళ్లారు. వారు బట్టలు ఉతుకుతుండగా యూసఫ్ బీ, మనవరాలు సబియా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఈత రాక మునిగిపోయినారు. వెంటనే అయేషమ్మా అరుచుకుంటూ బయటికి రాగా యూసఫ్ బీ అల్లుడు మహమ్మద్ విషయం తెలుసుకొని వెంటనే చెరువులోకి వెళ్ళి అక్కడ ఉన్న స్థానికుల సహాయంతో బయటకి తీయగా అప్పటికే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బాలుడి ప్రాణం తీసిన కారు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

నార్సింగీ కి చెందిన నవీన్ కుమార్ తన రెండు సంవత్సరాల కొడుకు జోయల్ ను తీసుకొని టపాసుల కోసం ఖాజాగూడ వెళ్లారు.తిరుగు ప్రయాణంలో అల్కాపూర్ రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్ ను వెనుకాల నుండి కార్ ఢీ కొట్టింది. ఆ తాకిడికి బైక్ పైన ఉన్న ఇద్దరు కింద పడిపోగా కారు చిన్నారి పై నుండి దూసుకొని వెళ్లింది. తీవ్ర రక్తస్రావం కావడం తో హుటాహుటిన ఆసుపత్రికి తరలించే క్రమంలో బాలుడి మృతి మృతి చెందాడు . ఈ మృతితోనవీన్ కుమార్ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మితిమీరిన వేగం మరో బాలుడిని పొట్టన బెట్టుకుంది. దీపావళి రోజు తమ గారాల పట్టి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడంటూ గుండెలు బాదుకుంది తల్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుమని పోలీసులు వెలవడించారు.

# పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలు పిఎస్ హెచ్ఎంలకే కేటాయించాలి

**పిఎస్ హెచ్ఎంఎ బుర్ర రమేష్**

**దేవరుప్పుల, విశాలభారతి:**



రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత పూర్తిగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలోనే జరగాలని, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్యవేక్షణలో భాగంగా పిఎస్ హెచ్ఎం లను నోడల్ ఆఫీసర్లుగా, మరియు ఎస్జీటీ ఉపాధ్యాయులను మెంబర్స్ గా నియమించాలని, కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో జీవో నెంబర్ 70 తేదీ 10102025 ద్వారా ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంలో, కొన్ని ఉపాధ్యాయ సంఘాలు దానిని వ్యతిరేకిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత హై స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని కోరుతున్నాయి. దీనిని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం గురించి, లెసన్ ప్లాన్ గురించి మరియు టీచర్ డైరీ గురించి పూర్తి అవగాహన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని, ఆ విషయాన్ని గుర్తించే ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను పీఎస్ హెచ్ఎం లకు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతములో వేతన కేంద్రాలు (పే యూనిట్స్ ) నిర్వహణ బాధ్యత పిఎస్ హెచ్ఎంలు మాత్రమే చేసేవారని, తక్షణమే ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి ప్రాథమిక పాఠశాలల మీద పిఎస్ హెచ్ఎంలు మాత్రమే పర్యవేక్షణ చేయాలని కోరారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్లుగా, మండల విద్యాధికారులుగా కేవలం పీఎస్ హెచ్ఎం లను మాత్రమే నియమించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# జాతీయ రహదారిపై గ్రానైట్ లారీ బీభత్సం



**తొర్రూర్, విశాలభారతి:**

తొర్రూర్ లో గ్రానైట్ లారీ బీభత్సం సృష్టించింది. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడును తరలిస్తున్న గ్రానైట్ లారీ అదుపుతప్పి అతివేగంగా వచ్చి మంగళవారం తెల్లవారు జామున పట్టణ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్ ను ఢీ కొట్టిన గ్రానెట్ లారీ సంఘటన వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్ళగా కరీంనగర్ కు చెందిన ఓ గ్రానైట్ కంపెనీ లారీలో భారీ గ్రానైట్ రాళ్లను లోడ్ చేసుకుని కరీంనగర్ నుండి తొర్రూరు మీదుగా ఖమ్మం వెళ్తున్న క్రమంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా పట్టణ కేంద్రంలోని బస్టాండ్ వద్ద లారీ డివైడర్ వైపు దూసుకెళ్లగా అందులోని గ్రానైట్ రాళ్లు రోడ్డుపై పడడంతో ప్రయాణికులు పాదచారులు ఎవరు ఆ సమయంలో లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది.లారీ ఇంజన్ ముందు బాగా మాత్రం నుజ్జు నుజ్జు అయి లారీ డ్రైవర్ క్లీనర్ లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించినట్లు సమాచారం. ఏపీ 39 యూఏ 7299 నెంబర్ గల లారీ కరీంనగర్ కు గ్రానైట్ కంపెనీకి సంబంధించిన లారీగా గుర్తించి అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

# రాజకీయ రసవత్తరం

( మొదటిపేజీ తరువాయి )

తమకు అనుకూలమైన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నాయి. గత రెండేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అనుసరిస్తున్న విధానాలు, గత పదేళ్లుగా ప్రజలు పడిన ఇబ్బందులు గుర్తు చేస్తూ ప్రచారం చేస్తున్నాయి. ఇలా ఎవరికి తోచినట్టు వాళ్లు ప్రజల మనసులు గెలుచుకునేందుకు పావులు కదుపుతుంటే న్యూట్రల్ గా ఉన్న వాళ్లు, అన్ని పార్టీలపై కోపం ఉన్న వాళ్లు, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వాళ్లు కూడా జూబ్లీహిల్స్ బరిలో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం చెప్పినట్టు ఇంత వరకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఇవ్వడం లేదని ఆరోపించిన నిరుద్యోగులు జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసినట్టు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్మిస్తున్న ట్రిపుల్ ఆర్ బాధితులు కూడా నామపత్రాలు వేసినట్టు తెలుస్తోంది. ఇలా బాధితులంతా బరిలో ఉండి గేమ్‌ఛేంజర్‌గా మారి తమ సత్తా చాటాలని చూస్తున్నాయి. ఇలా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భారీగా నామినేషన్లు దాఖలు అయినట్టు సమాచారం. వందకుపైగా దాదాపు 150 వరకు నామినేషన్లు వచ్చాయని అధికారులు చెబుతున్నారు.

**24న సాయంత్ర తుది పోటీదారుల జాబితా**

భారీగా వచ్చిన నామినేషన్లు రేపు బుధవారం అధికారులు పరిశీలిస్తారు. వాటిలో రూల్స్‌కు అనుగుణంగా ఉన్న వాటిని ఉంచుతారు మిగతా వాటిని తిరస్కరిస్తారు. ఇలా కొన్నింటిని తిరస్కరించిన తర్వాత కొన్ని ఫైనలైజ్ అవుతాయి. అప్పుడు కూడా అక్టోబర్ 24 వరకు ఎవరైనా ఉపసంహరించుకునే ఛాన్స్ ఉంది. అప్పుడు కూడా కొందరు తమ నామినేషన్ వెనక్కి తీసుకున్న అనంతరం మిగిలిన వాళ్లు తుది పోటీదారులుగా ప్రకటిస్తారు.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిని పరామర్శించిన పెద్ది



**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం,రాంబోజిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెండ్లి సోమిరెడ్డి తల్లి పెండ్లి వీరమ్మ గత వారం 15న మరణించిన విషయం తెలుసుకొని ఈరోజు వారి ఇంటికి వెళ్లి సోమిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి వెంట పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,దేవరుప్పుల మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉప్పుల అనిల్,కుమార్,చింత ఎల్లయ్య,కారుపోతుల యాకస్వామి,కారుపోతుల నరేష్,తోటకూరి మహేష్, పెద్ది రంజిత్ కుమార్,కారుపోతుల సతీష్,చింత సాగర్,తదితరులున్నారు.

# కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన విజయకుమార్

**పెద్ద అంబర్పేట్ , విశాలభారతి:**



బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ,మాజీ ఐటి శాఖ మాత్యులు కల్వకుంట్ల తారక రామారావుని సోమవారం రోజు బంజారాహిల్స్ నంది నగర్ లో వారి నివాసం వద్ద బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని బండరావిర్యాల కందికంటి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలు, రాష్ట్ర రాజకీయ పరిణామాలు భవిష్యత్ కార్యక్రమాలపై సవివరంగా చర్చ జరిగినట్లు సమాచారం. పార్టీ బలోపేతం దిశగా కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి అని అన్నారు.

# పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యక్రమం

**ఆర్మూర్, విశాలభారతి:**



ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో పొగాకు తో తయారైన మత్తు పదార్థాలు సిగరెట్టు, గుట్కా, తంబాకు మరియు జరద వంటి పదార్థాలను తినకూడదని, మత్తు పానీయాలను త్రాగకూడదని, వాటి ద్వారా వచ్చే అల్సర్, పక్షవాతము, రక్తం గడ్డ కట్టడం మరియు క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలని డాక్టర్ మానస మంగళ వారం రోజున వివరించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాస్ చెడు వ్యసనాలు చెడు స్నేహం చేయకూడదని మంచి అలవాట్లను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**దేవరుప్పుల, విశాలభారతి:**



మండలకేంద్రంలో పీఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి. రైతులు పండించిన పంటను పరిశీలించి కొనుగోలు కేంద్రాల సదుపాయాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్షించి స్థానిక రైతులతో ముచ్చటించి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకోవాలిసిన జాగ్రత్తలను సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా,పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని,వరి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు జరగాలని,రైతులను ఎవరైనా ఇబ్బంది పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని,ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు,తేమ శాతం కొలిచే పరికరాలు సక్రమంగా పనిచేయాలని,చెల్లింపులు సమయానికి జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించి రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయని,రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# నాడి పట్టే నాథుడేడి

- బస్తీ దవాఖానను సందర్శించిన హరీశ్ రావు
- కేసీఆర్ బస్తీ దవాఖానలు ప్రారంభించారు
- డాక్టర్లకు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు
- వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కి బుద్ధి చెప్పాలి
- 40 రకాల మందులు సప్లై లేదు
- 108 సర్వీస్ సకాలంలో రాకపోవడం లేదు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బస్తీలో ఉండే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు కేసీఆర్ బస్తీ దవాఖానలు ప్రారంభించారని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు బుద్ధి రావాలంటే జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓల్డ్ లింగంపల్లి బస్తీ దవాఖానను ఆయన సందర్శించి మాట్లాడారు. 'బస్తీ ప్రజలకు ఇబ్బంది కలగవద్దు. తమ గడప దగ్గరనే, తమ వాకిట్లోనే వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా బస్తీ దవాఖానలను బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించడం జరిగింది.' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 450 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తే..ఒక్క హైదరాబాదులోనే 350 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశామని హరీశ్ చెప్పారు. తమ హయాంలో 110 రకాల మందులు ఉచితంగా అందించే వాళ్ళమని పేర్కొన్నారు. 130 రకాల పరీక్షలను ఉచితంగా చేసి పేషంట్ల ఫోన్ లకే రిపోర్టులు పంపించే వాళ్ళమని వివరించారు. ఆరు నెలల నుండి జీతం రావడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. బస్తీ దవాఖానలో పనిచేసే సిబ్బందికి ఆరు నెలల నుంచి జీతాలు రాకపోతే వారు పని ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పేదొకటి చేసేదొకటని ఎద్దేవా చేశారు. ఒకటో తారీకు అందరికీ జీతాలు ఇస్తామని చెప్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలో పనిచేస్తున్న సిబ్బందికి ఆరు నెలల నుంచి జీతం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేవలం 60, 70 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని.. 40 రకాల మందులు సప్లై లేదని హరీశ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో 108 సర్వీస్ సకాలంలో రాకపోవడం వల్ల, వైద్యం అందకపోవడం వల్ల మనిషి ప్రాణం పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్పిటల్లో కేసీఆర్ కిట్టు ఇవ్వకపోవడం వల్ల 20శాతం డెలివరీలు ప్రైవేటు ఆసుపత్రికి బదిలీ అయ్యాయని చెప్పారు. కేసీఆర్ మీద కోపంతో పథకాలను బంద్ చేస్తే పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ఎంతసేపు మద్యం దుకాణాలు పెంచుదామా, సారా ఎట్లా అమ్ముదామా, పైసలు ఎట్ల సంపాదిద్దామా, అని తప్ప రేవంత్ రెడ్డికి వేరే ఆలోచన లేదన్నారు. వైన్ షాపుల టెండర్లకు రెండు లక్షల నుండి మూడు లక్షలకు పెంచి అడ్డగోలుగా డబ్బు సంపాదించాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడని ఆరోపించారు.

జనం తాగాలే ఊగాలే రేవంత్ రెడ్డి కిట్టి నిండాలే కానీ.. ఒకనాడు అయినా ప్రజా ఆరోగ్య వ్యవస్థపై రివ్యూ చేసావా రేవంత్ రెడ్డి? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ ప్రజలు కూడా ప్రశంసించడం లేదన్నారు. తమ హయాంలో ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోతే సేవలు నిలిపివేస్తామని హెచ్చరించాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కింద రూ.7,000 కోట్ల చెల్లింపులు చేసిందని గుర్తు చేశారు. రూ.3000 కోట్లు సీఎంఆర్ఎఫ్ కింద అప్పటికి ప్రభుత్వం అందించిందని గుర్తు చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పనిచేయడం లేదన్నారు.

# టార్గెట్ రేవంత్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దగ్గర పడుతోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా కొత్తలో నేతలంతా.. ఒక్కతాటిపై ఉన్నట్టు కనిపించారు. కానీ కొద్ది రోజులుగా అధికార పార్టీ నేతలు ఎవరికి వారు వ్యవహరిస్తుండటం తీవ్ర దుమారం రేపుతోంది. కొద్ది రోజులుగా అధికార పార్టీ నేతల వ్యవహారం అధికార పార్టీకి ఇబ్బందిగా మారింది. మంత్రి కొండా సురేఖ, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యవహారం పార్టీకి ఇబ్బందిగా మారింది. నలుగురు నేతలు ప్రభుత్వంలో కొనసాగుతూనే సీఎంను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. అటు పార్టీ పెద్దలు సైతం వీరిని పట్టించుకోకపోవడంతో.. మరింత వాయిస్ పెంచేసి సర్కార్ కు చుక్కలు చూపిస్తున్నారు. దాంతో ఈ నేతల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇక మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్ డైలీ సీరియల్‌ను తలపిస్తోంది. ఆరు నెలలకు ముందు అక్కినేని ఫ్యామిలీ మ్యాటర్ లో మంత్రి నోరు జారారు. ఆ తర్వాత మంత్రి నిత్యం ఏదో ఒక వివాదంలో మునుగుతున్నారు. ఆ తర్వాత తన కేబినెట్ మంత్రులను ఆమె టార్గెట్ చేశారు. రెడ్డి లీడర్లంతా బీసీలను టార్గెట్ చేశారని విమర్శలు గుప్పించారు. అంతకుముందు కొందరు ఎమ్మెల్యేలు తనను మంత్రి పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాదు వరంగల్ నేతలపై కొండా మురళి నోరు పారేసుకున్నారు. ఆ తర్వాత మేడారం ఆలయం డెవలప్‌మెంట్ కోసం నిర్వహించిన టెండర్లలో మంత్రి పొంగులేటి పై సంచలన ఆరోపణలు చేశారు. ఆ వెంటనే మంత్రి ఓఎస్డీ సుమంత్‌ను ప్రభుత్వం తప్పించింది. దాంతో ఈ వ్యవహారం కాస్తా.. పెద్దది కావడంతో మంత్రి కూతురు రంగంలోకి దిగారు. మంత్రి కొండా సురేఖ ఓఎస్డీని తన ఇంట్లోనే పెట్టుకుని సర్కార్ కు సవాల్ విసిరారు. అయితే మంత్రి కొండా సురేఖ వ్యవహారం చల్లబడ్డప్పటికీ.. ఆమె ద్వారా పార్టీని జరగాల్సినంతా డ్యామేజ్ జరిగిందని ప్రచారం సాగుతోంది.

అటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డిది మరో కథ. ఈయన కూడా కొద్ది రోజులుగా సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా సీఎం రేవంతే అడ్డుకుంటున్నారని విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్సైజ్ టెండర్ల వ్యవహారంలోనూ రాజ్ గోపాల్ రెడ్డి తన మార్క్ చూపించే ప్రయత్నం చేశారు. మునుగోడులో తెలంగాణ ఎక్సైజ్ పాలసీ అమలు చేయొద్దంటూ హుకుం జారీ చేశారు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలపై కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకే మద్యం దుకాణాలు తెరిచి ఉండాలని, పర్మిట్ రూంలు ఉండొద్దని రాజగోపాల్ రెడ్డి కండిషన్స్ పెట్టారు. దీంతో టెండర్లు వేయడానికి భయపడిన మద్యం వ్యాపారులు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. అయితే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్రమంతా ఒకటే రూల్ ఉంటుంది. ఒక్కో నియోజవర్గానికి ఒక్కో రూల్ ఉండదు, అందరూ ఫాలో అవ్వాల్సిందే అంటూ ఎమ్మెల్యేకు కౌంటర్ ఇచ్చారు. అయితే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై, ప్రభుత్వం అధిష్టానానికి పూర్తి నివేదిక పంపినట్లు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

మరోవైపు మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా సొంత పార్టీని టార్గెట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలకు అన్ని కోణాల్లోనూ నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. పొరుగు పార్టీల నుంచి వలస వచ్చినవాళ్లకు కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. అంతేకాదు కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వాళ్లకు ఇవ్వొద్దని నిబంధన ఉందా అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ప్రశ్నించారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి జీవన్ రెడ్డి భేటీ అయ్యారు. ఏళ్లతరబడి పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. జగిత్యాల నియోజవర్గంలో పార్టీ పదవులు ఇచ్చే సమయంలో మాజీ ఎమ్మెల్యే ఇదిలా ఉంటే మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. తనకు ఏమాత్రం అవకాశం దొరికినా వదిలిపెట్టడం లేదు. గతంలో హైడ్రా పనితీరును తప్పుబట్టారు. ఆ తర్వాత మంత్రుల జిల్లాలు, వారి నియోజకవర్గాలకే నిధులు వెళ్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు గెలిపిస్తేనే కదా ఎమ్మెల్యే, మంత్రులు, సీఎం అయ్యేదని ప్రశ్నించారు. ఇంకో రెండుసార్లు గెలిపించండి, తాను కూడా సీఎం అభ్యర్థి అవుతానంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. గత కొంత కాలంగా సొంత ప్రభుత్వాన్ని అనిరుధ్‌రెడ్డి టార్గెట్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఎమ్మెల్యే వ్యవహారం కూడా పార్టీకి ఇబ్బందిగా మారిందనే చర్చ జరుగుతోంది.

మొత్తంమీద అధికార పార్టీలో కొనసాగుతూ.. సొంత ప్రభుత్వాన్నే నేతలు టార్గెట్ చేస్తున్నారు. అయితే పార్టీపై విమర్శలు చేస్తున్న నేతలపై చర్యలు తీసుకోవడంలో.. క్రమశిక్షణ కమిటీ పూర్తిగా ఫెయిల్ అయ్యిందనే చర్చ జరుగుతోంది. పార్టీకి వ్యతిరేకంగా గళం విప్పిన తొలినాళ్లలోనే వీరిపై చర్యలు తీసుకుని ఉండుంటే.. ఇప్పుడా పరిస్థితి ఉండేది కాదని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి. అలాకాకుండా నేతలపై చర్యలకు హైకమాండ్ వెనుకాడటంతోనే పరిస్థితి ఇక్కడి వరకు వచ్చిందని అంటున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, విశాలభారతి:**

నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఎడిగికొట్ల మాధురి, కట్టుల మార్కండయ్య గతంలో మాజీ ఎమ్మెల్యే రి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. వారికి మంగళవారం తన నివాసం వద్ద యాభైవేల రూపాయల సిఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు. అనంతరం అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద ప్రజలు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సీఎంఆర్ఆఫ్ నిరుపేదలకు అండగా మారిందాన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అలాగే మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో ప్రజా పాలన ద్వారా బడుగు,బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రజాపాలనలో పేద,మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి,ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర్ రాజానర్సింహా కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఉదయ్, రఘు గౌడ్, చోటు, యాదగిరి, సురేష్, విజయ్, రవి, లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యక్రమం



**ఆర్మూర్, విశాలభారతి:**

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో ని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో పొగాకు తో తయారైన మత్తు పదార్థాలు సిగరెట్టు, గుట్కా, తంబాకు మరియు జరద వంటి పదార్థాలను తినకూడదని, మత్తు పానీయాలను త్రాగకూడదని, వాటి ద్వారా వచ్చే అల్సర్, పక్షవాతము, రక్తం గడ్డ కట్టడం మరియు క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలని డాక్టర్ మానస మంగళ వారం రోజున వివరించడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాస్ చెడు వ్యసనాలు చెడు స్నేహం చేయకూడదని మంచి అలవాట్లను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా అమర వీరుల సంస్మరణ దినోత్సవం

**పెద్ద అంబర్పేట్ , విశాలభారతి:**

2025 అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పోలీస్ అధికారులు, సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ... దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులు ప్రతి పోలీసు సిబ్బందికి స్ఫూర్తి ప్రదాతలు. వారి త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజాసేవలో మరింత కృషి చేయడం మనందరి ధర్మం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డి ఐ, ఎస్సైల తోపాటు,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని మౌనం పాటిస్తూ అమరుల ఆత్మలకు నివాళులు అర్పించారు.

# తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో పాల్గొనండి

- ఈనెల 25 తో ముగియనున్న సర్వే
- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పిలుపు



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**

తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందనీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం వరకు ఈ సిటిజన్ సర్వే లో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారన్నారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047 " సిటిజన్ సర్వేను చేపట్టిందనీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున www.telangana.gov.in/telanganarising అనే వెబ్సైట్ ను సందర్శించి జిల్లా ప్రజలు ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రాజేంద్రనగర్, విశాలభారతి :**



రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్ బస్తీ వద్ద జరిగింది. వివరాలు.. హోటల్ లో పని ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతున్న దినకర్ (44)ను కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# నేరాలకు పాల్పడుతున్న కేటుగాడు అరెస్ట్

- నిందితుని నుండి రూ. 6లక్షల 31 వేలు నగదు
- కారు, 23 ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**

ఏటీఎం సెంటర్లలో డబ్బులు డ్రా చేయడానికి వచ్చే వృద్ధులు, నిరక్షరాసులు, అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు సూర్యాపేట జిల్లాకు చెందిన సుద్దబోయిన వెంకటేష్. ఇతను రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే తరహా మోసాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. వెంకటేష్ ఏటీఎం సెంటర్ వద్ద డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన వారిని "కార్డు పని చేయడం లేదు, నేను సహాయం చేస్తాను" అంటూ నమ్మబలికి, వారి పాస్‌వర్డ్ తెలుసుకొని, తన వద్ద ఉన్న ఇతర కార్డులతో తారుమారు చేసి డబ్బులు దోచుకుంటూ వచ్చాడు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఇటీవల యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంల వద్ద కూడా అతను ఇదే విధంగా ప్రజలను మోసం చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ ఘటనలపై మూడు కేసులు నమోదు అయ్యాయి. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, అతని వద్ద నుంచి రూ. 6,31,000 నగదు, ఒక బ్రీజా కారు, 23 ఏటీఎం కార్డులు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ డీ. సునీతా రెడ్డి మాట్లాడుతూ.. నిందితుడు గతంలో సూర్యాపేట, ఖమ్మం జిల్లాలలో కూడా మోసాలకు పాల్పడుతూ 2021 నుండి ఇప్పటివరకు 27 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, పలు సార్లు అరెస్టయినప్పటికీ తన నేరప్రవర్తన మార్చుకోలేదని తెలిపారు. అతనిపై పీడీ యాక్ట్ కూడా అమలు చేసినట్లు డీసీపీ వెల్లడించారు. మళ్లీ ఏటీఎం సెంటర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో పోలీసు బృందం అతన్ని అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించింది.

# పోచమ్మ దేవాలయంలో అన్న ప్రసాదం

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

మైలర్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ పరిధిలోనీ పోచమ్మ దేవాలయంలో అన్నప్రసాదాన్ని దాతల సహకారంతో మొదలుపెట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్య అతిథిగా మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ మాజీ కౌన్సిలర్. దాతలకు దేవాలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ అన్న ప్రసాదంలో పాల్గొన్న భక్తులకు కొలిచేవారికి కొంగు బంగారం గా నిలిచిన పోచమ్మ తల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుండి తండోప తండాలుగా వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించి పసుపు కుంకుమలు సమర్పించి అమ్మవారి మొక్కును తీర్చుకోవడంతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలను చల్లగా చూడాలని అన్నప్రసాదంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయ కమిటీ అధ్యక్షుడు సెంట్రింగ్ శంకర్ తో మల్లేష్ మల్లు ఆవుల కృష్ణ , బాయికాడి అంజి , మొగిలి శ్రీశైలం , గుండప్ప , రాజ్ కుమార్ , మహేష్ , గడ్డమీది కిష్టప్ప , పోతరాజు మల్లేష్ భాగ్యమ్మ , సత్య కుమారి , మహేశ్వరి , రఘు కురుమప్ప , ఫ్రూట్ సాయి , ఉప్పరి వాసుదేవ్ , ఉప్పరి రాజు , సెంట్రింగ్ సాయి మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సదర్ సమ్మేళనంలో పాల్గొన్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు




జక్కిడి శివ చరణ్ రెడ్డి

**పెద్ద అంబర్పేట్ , విశాలభారతి:**

దీపావళి వేడుకల సందర్భంగా నాదర్ గూల్ ప్రాంతంలో యాదవ సోదరులు అంగరంగ వైభవంగా నిర్వహించిన సదర్ సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, నృత్యాలతో సదర్ సమ్మేళనం వైభవంగా సాగింది. యాదవ సోదరుల ఐక్యత, సాంప్రదాయ పరిరక్షణ పట్ల శివ చరణ్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన యాదవ సోదరులకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో ఇలాంటి సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాదర్ గూల్ గ్రామ యాదవ సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
బుధవారం
22 అక్టోబర్ 2025
CINEMA

# త్రివిక్రమ్-వెంకీ సినిమాలో 'హిట్' బ్యూటీ

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్, విక్టరీ వెంకటేష్ కాంబోలో ఇటీవల ఓ కొత్త సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సినిమాను హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్.రాధాకృష్ణ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన క్యాస్టింగ్ విషయంలో మేకర్స్ ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు.ఈ సినిమాలో హీరోయిన్‌గా అందాల భామ శ్రీనిధి శెట్టి ఓకే అయినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. 'హిట్-3' సినిమాతో టాలీవుడ్‌లో సాలిడ్ హిట్ అందుకున్న ఈ బ్యూటీ, రీసెంట్‌గా తెలుసు కదా చిత్రంతో వచ్చింది. కాగా, నేడు(అక్టోబర్ 21) శ్రీనిధి శెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమె ఈ సినిమాలో నటిస్తుందనే వార్తను మేకర్స్ రివీల్ చేశారు. వెంకటేష్ వంటి సీనియర్ హీరో సరసన ఈమె నటిస్తుందనే వార్తతో ఒక్కసారిగా ఈ మూవీపై ఆసక్తి క్రియేట్ అయింది. మరి ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి ఎలాంటి పాత్రలో నటిస్తుందో తెలియాలంటే ఈ సినిమా రిలీజ్ అయ్యే వరకు వెయిట్ చేయాల్సిందే





# ఓటీటీలో దూసుకుపోతున్న మంచు లక్ష్మి 'దక్ష'..

టాలీవుడ్ నటి మంచు లక్ష్మీ ప్రసన్న ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ చిత్రం 'దక్ష - ది డెడ్‌లీ కాన్స్పిరసీ' (Daksha - The Deadly Conspiracy) ఓటీటీలో దూసుకుపోతుంది. దీపావళి కానుకగా ఈ చిత్రం అక్టోబర్ 17 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ఓటీటీ లోకి వచ్చిన మొదటిరోజు నుంచే ట్రెండింగ్‌లో నిలుస్తుంది. తాజాగా ఈ చిత్రం టాప్ 9లో కొనసాగుతుంది. అయితే ఈ సినిమాను ఓటీటీలో సక్సెస్ చేసిన ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది సైకలాజికల్ థ్రిల్లర్ గా రూపొందిన ఈ చిత్రం శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై అత్యున్నత నిర్మాణ విలువలతో తెరకెక్కింది. ఈ సినిమాలో మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మీ తొలి సారిగా ఒకే సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. ఈ తండ్రీ - కూతుళ్ల కాంబినేషన్ కారణంగా సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. అందుకు తగ్గట్టే థియేటర్స్ లో ప్రశంసలు అందుకుంది ఈ చిత్రం. వంశీ కృష్ణ మల్లా ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే మరియు దర్శకత్వం వహించారు.

# సన్యాసం తీసుకునే ఆలోచనలో రేణూ దేశాయ్



ఒకప్పుడు హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రేణూ దేశాయ్, పవన్ కళ్యాణ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుని సినిమాలకి గ్యాప్ ఇచ్చింది. అనంతరం ఇద్దరు పిల్లలకు తల్లిగా మారి కొన్నాళ్లపాటు పవన్‌తో వైవాహిక జీవితం కొనసాగించింది. అయితే కొన్ని కారణాల వలన వారిద్దరు విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. పవన్ నుండి విడిపోయిన తర్వాత పూణెలో స్థిరపడిన రేణూ, అప్పుడప్పుడు సోషల్ మీడియా లేదా వ్యక్తిగత వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తూ వస్తున్నారు. ఇటీవల రవితేజ హీరోగా వచ్చిన టైగర్ నాగేశ్వరరావు సినిమాలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్న రేణూ, ఆ తర్వాత మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఆ సినిమా చేసినప్పుడు నాపై చాలా విమర్శలు వచ్చాయి. కానీ యాక్టింగ్ అంటే నాకు ఇష్టం , అదే నా టార్గెట్ కాదు" అని ఆమె ఇటీవల స్పష్టంచేశారు.

# పెళ్లయిన డైరెక్టర్ తో ప్రేమ..



ఇండస్ట్రీ అన్నాకా రూమర్స్ అనేవి కామన్. హీరో హీరోయిన్ సినిమాలో కాకుండా బయట కనిపిస్తే వారిమధ్య ఏదో ఉందని చెప్పుకొచ్చేస్తారు. పెళ్లైన హీరోతో హీరోయిన్ కనిపిస్తే.. ఆ హీరో తన భార్యకు విడాకులు ఇచ్చి ఈమెతో డేటింగ్ చేస్తున్నారు అంటారు. విడాకులు అయిన హీరోతో హీరోయిన్ కనిపిస్తే.. రెండో పెళ్లికి హీరో రెడీ అని చెప్పుకొస్తారు. అయితే ఇక్కడ ప్రతీదీ హీరోయిన్ మీదనే వస్తుంది. తాజాగా ఇలాంటి రూమర్స్ నే ఎదుర్కొంటుంది అచ్చ తెలుగందం ఈషా రెబ్బా. ఈషా రెబ్బ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందం, అభినయం ఉన్నా కూడా అవకాశాలు లేక, సక్సెస్ రాక చాలా స్ట్రగుల్స్ లో ఉంది. ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ అని ఎదురుచూస్తూనే ఉంది. ప్రస్తుతం ఈ చిన్నది ఓం శాంతి శాంతి శాంతి అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. మలయాళంలో సూపర్ హిట్ అయిన జయ జయ జయ జయహే సినిమాకు రీమేక్ గా ఈ సినిమా తెరకెక్కింది.ఇక ఓం శాంతి శాంతి శాంతి సినిమాలో డైరెక్టర్ కమ్ యాక్టర్ తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్నాడు. ఏఆర్ సంజీవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక సినిమా విషయం పక్కన పెడితే ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి తరుణ్ - ఈషా ప్రేమలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య ఎక్కడ చూసినా ఈ జంటనే కనిపిస్తుంది. తాజాగా దీపావళి సెలబ్రేషన్స్ లో కూడా వీరు కలిసి కనిపించడం ఈ రూమర్స్ ను ఇంకా నిజం అని నమ్మేలా చేసాయి. హీరో విశ్వక్ సేన్ ఇంట జరిగిన ఈ వేడుకలకు తరుణ్, ఈషా కలిసి పాల్గొన్నారు. ఇ సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇక వీరిద్ద నిజంగా రిలేషన్ లో ఉన్నారని పుకార్లు ఎక్కువ అయ్యాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.